

# సగం మనిషి

'మనిషిమీద నమ్మకం ఉంచడం మన కనీస కర్తవ్యం' అనేది నావాదన ఆ విషయం మీద వీలైతే ఉపన్యాసాలు యిచ్చేవాడ్ని.. అక్కడక్కడ దెబ్బలాటలు..తగువుల్లోకి కూడా చిక్కుపోతూ ఉంటాను. అయి నా నమ్మకం..నా వాదనల మీద. నాకు కొంచెం పట్టుదల ఎక్కువ.. అందులో ఈ విషయంలో నేనెప్పుడు.. టోకర తిన లేదు.. అంచేత కించిత్ గర్వం కూడా ఉంది.

అయితే.. నా వాదనకి బద్ధవ్యతిరేకం మా ఆవిడ..! ఇది సహజమే అంటారో.. మరేమంటారో.. గాని. నాకు, మా ఆవిడకి.. ఈ విషయం మీద అప్పుడప్పుడు వాగ్వివాదాలు.. వాదోటలు జరుగుతుంటాయి!

"మీరందర్నీ నమ్ముతూ కూర్చోండి..ఎపుడో ఓరోజు.. ఈ మనుషులే మిమ్మల్ని నట్టేట్లో ముంచేస్తారు.. అనేది ఆవిడ నమ్మకం..(ప్రగాఢ వాంఛ కూడానేమో..!) "నీదంతా..వితండ వాద నేగాని.. యింగితజ్ఞానం శూన్యం! మనిషి మొహాన్ని చూసి..అతని గురించి సగం చెప్పొచ్చు.. అదిగో.. అజ్ఞానమే నా ంది" అంటూ మా ఆవిడ మాటల్ని కొట్టి పారేస్తుంటాను.

"అంతెందుకు.. నేను నిన్ను బాగానే పోషిస్తాను. నీకు అన్యాయం చేయననే గట్టి నమ్మకంతోనే.. మీ న్నా.. నీపెళ్ళి నాతో ఖాయం చేశాడు! ఇలాంటివన్నీ.. ఒకరిమీద ఒకరు నమ్మకం ఉంచి చేసే పనులే తప్ప వేరోటి లేదు.. అంటూ..మా ఆవిడ మూడ్ చూసి.. అప్పుడప్పుడు సెంటిమెంట్ మీద దెబ్బకొడ్తూ ఉంటాను.

అయితే.. నా అభిప్రాయంలో... నేనెన్నడు.. ఓడిపోలేదు!

కాని.. ఇప్పటి నా పరిస్థితి వేరుగా వుంది.. నలభై సంవత్సరాల జీవితంలో ఎదురుపడని పరిస్థితి.. ఎదురై.. నన్ను యిబ్బందుల్లో పడేసింది!

అంటే.. ఓటమిని అంగీకరించవలసిన పరిస్థితుల్లో కూరుకుపోయాను, అది యింకెక్కడో అయితే ఫర్వాలేదేమో.. కాని.. ఎదురుగా కూర్చుని.. నన్ను విజయగర్వంతో సూటిగా చూస్తున్నది అక్షరాల.. మాఆవిడే!

మనిషికి ఓటమి పైవాళ్ల దగ్గర ఎదుర్కోవాల్సివచ్చినప్పటికంటే.. 'శ్రీమతి' ఎదురుగా ఓటమిని అంగీకరించడం.. అది డబుల్ ఓటమి లాంటిది!

అసలేం జరిగిందంటే—

మాబంధువులమ్మాయి పెళ్ళికని.. రైల్లో విజయవాడ బయలుదేరాం.. 'చిల్లరగట్రా జాగ్రత్తగా పట్టుకోండి.. దారి ఖర్చులకు యిబ్బందుండదు..' అంటూ మా ఆవిడ ముందుగానే హెచ్చరించింది.

'ఆ . ఫర్లేదు.. మధ్యలో కాఫీ తాగితే.. బోల్డు చిల్లర వాడే యిస్తాడు.. అంటూ ఆవిడ మాటల్ని కొట్టిపారేసాను.

పిఠాపురం స్టేషన్‌లో కాఫీ తాగి.. అతగాడికి చిల్లర యిమ్మంటూ.. ఏభై రూపాయల నోటు అందించాను.

'చిల్లరలేదు సార్.. అంటూ.. నానోటు అందించబోయాడు. ఒక్కసారిగా నా సిద్ధాంతాలు గుర్తుకొచ్చాయి..

"ఫర్లేదు.. చిల్లరతెచ్చి యివ్వు" అంటూ.. అతడికి నోటు.. యిచ్చివేసి.. ఓసారి మాఆవిడవైపు గర్వంగా చూసా...

"అలాగేసార్... యిప్పుడే తెస్తాను.. అంటూ ప్లాట్‌ఫారం జనాభాలో కల్సిపోయాడు.

ఓ ఐదు నిమషాలు గడిచాయి.. వాడి జాడ కనబడలేదు.

'అయిందా..' అన్నట్టు.. చూసింది మా ఆవిడ..

పర్లేదు.. వాడే తెస్తాడు..' ఓ చిరునవ్వుతో నిర్భంగానే అన్నాను..

అంతలో రైలు కూత వినబడింది.. యింకొద్ది క్షణాల్లో రైలు బయలుదేరింది..

కాఫీ కుర్రాడు ఎక్కడా కనబడలేదు.. కిటికీలోంచి జనాన్ని పరిశీలిస్తున్నానేగాని.. మొహం బొత్తిగా గుర్తులేదు.. కాఫీ తాగి, డబ్బులు యిచ్చేసా గాని.. అతడి మొహాం సరిగా పరిశీలించలేదు.. కనీసం.. ఏరంగుషర్టు తొడుక్కున్నాడో కూడా గుర్తులేదు. సరిగ్గా.. అప్పుడే నాలో ఓ రకమైన భయం చోటుచేసుకుంది.

డబ్బులు పోతేపోయాయి. గాని.. నా అభిప్రాయాలు.. మా ఆవిడముందు చులకనై పోవడం... చాలా యిబ్బందికరమైన విషయం! ఆ బాధే ఎక్కువగా ఉంది!

రైలు వేగాన్ని అందుకుంది..

సామర్లకోట స్టేషన్‌లో రైలు మళ్ళీ ఆగింది..' డబ్బు పోతేపోయింది. మీ పొగరు తగ్గింది...' అన్నటున్నాయా చూపులు..

ఓటమిని అంగీకరించినట్టు.. తలదించుకుని కూర్చున్నాను...

మాయిద్దరి మధ్య మాటలు కరువైపోయాయి.

ఏలూరు స్టేషన్‌లో రైలు ఆగింది!

"సార్..సార్.. అంటూ.. కేక వినబడేసరికి..ఏదో ఆలోచిస్తున్నావాడ్ని.. ఒక్కసారి స్పృహలోకొచ్చాను.

'మేకే కదాసార్.. చిల్లర యివ్వాలి..' అంటూ.. చిల్లర నాచేతిలో పెట్టాడు..

నా ఆనందానికి అంతులేకుండాపోయింది. ఓసారి కాలరు సవరించుకుని.. చిల్లర లెక్క చూసాను.. ఎనిమిది రూపాయాలే ఉన్నాయి.

"ఏంబాబూ..రెండు కాఫీలు త్రాగి ఏభైరూపాయిలనోటిచ్చాను... ఎనిమిదే— ఇచ్చావూ! అంటూ.. అడిగాను..

"ఏభై రుపాయలా?

ఎవరికిచ్చారు... ! పదిరూపాయాలనోటు యిచ్చారు. మిగతా చిల్లర ఎనిమిది రూపాయాలేకదా.. అయినా.. నిజాయితీగా డబ్బులు వాపసు ఇస్తే.. ప్రయాణికులతో యిదే ఇబ్బంది..!! అంటూ గుర్రుగా చూసి... జనంలో కల్సిపోయాడు!

ఇక.. నాకు మాట్లాడే అవకాశమే రాలేదు..

నానోటిలోని మాట... నోట్లోనే ఉండిపోయింది!

ఎదురుగా మా ఆవిడ మొహంలో. సగం కోపమే కనిపించింది!

నాలో మాయమైన సగం మనిషి.. ఆచూకి కనబడలేదు.